నమస్తే తెలంగాణ
ఆదిలాబాద్ - నిర్మల్
3 | నిజామాబాద్ సోమవారం 7 అక్టోబర్ 2024 | ADILABAD NIRMAL

దిలావర్‌పూర్‌లో అమ్మవారి నగల శోభాయాత్రను తిలకిస్తున్న భక్తజనం

అడెల్లి తల్లీ.. సల్లంగ సూడు..

సాంగ్వీ వద్ద గోదావరిలో అమ్మవారి నగలకు అభిషేకం

- శోభాయాత్రకు ఊరురా స్వాగతం పలికిన భక్తులు
- భారీ బందోబస్తుతో అడెల్లి ఆలయానికి నగలు
- తరలి వచ్చిన భక్తజనం

దిలావర్‌పూర్, అక్టోబర్ 6 : కోరిన కోర్కెలు తీర్చే అమ్మల గన్న అమ్మ అడెల్లి పోచమ్మ మమ్ము సల్లంగ సూడు.. పాడి పంటలు సమృద్ధిగా వచ్చేలా దీవించు తల్లీ అని కోరుతూ ఆదివారం అడెల్లి పోచమ్మ గంగానీళ్ల జాతర భక్తజనంతో పులకించింది. సాంగ్వీ గ్రామ సమీపంలోని గోదావరిలో ఉదయం నాలుగు గంటలకు నగలకు ఆలయ పండితులు గోదావరి జలాలలో అభిషేకం చేసి ప్రత్యేక పూజలు చేశారు. అక్కడి నుంచి ప్రారంభమైన శోభాయాత్ర కంజర్, బన్సపల్లి, దిలావర్‌పూర్, మాడెగాం, కదిలి, ప్యారమూర్ గ్రామాల మీదుగా అడెల్లి ఆలయానికి చేరుకుంది. శోభాయాత్రను తిలకించేందుకు భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి మొక్కులను చెల్లించుకున్నారు. శోభాయాత్ర యువకుల నృత్యాలు, శివసత్తుల చిందుల మధ్య దాదాపు మూడు గంటల పాటు సాగింది. నిర్మల్ డీఎస్పీ గంగారెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు. భక్తులకు ఇబ్బంది కలుగకుండా దిలావర్‌పూర్, సాంగ్వీ గ్రామాల్లో పంచాయతీల ఆధ్వర్యంలో అధికారులు ఏర్పాట్లు చేశారు.

సాంగ్వీగోదావరి నదిలో నగలను అభిషేకం చేసుకొని తీసుకువస్తున్న ఆలయ పండితులు, బందోబస్తులో పోలీస్ సిబ్బంది

కనుల పండువగా జాతర

ఆలయం వద్ద మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు

- ఇతర రాష్ట్రాల నుంచి తరలివచ్చిన భక్తజనం
- భారీగా పోలీసుల బందోబస్తు
- ముగిసిన గంగనీళ్ల పండుగ

సారంగాపూర్, అక్టోబర్ 6 : 'అందాల బండెక్కి.. అడెల్లికి పోదము.. తమ్ముడో, తమ్ముడో.. చిన్నపెద్దలంతా గుడి జాతరను చూసోద్దాము..' అంటూ భక్తులు శ్రీ మహా అడెల్లి పోచమ్మ గంగానీళ్ల జాతరకు ఆదివారం తరలివచ్చారు. ఆదివారం వేకువ జాము నుంచే భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి పవిత్ర కోనేరులో పుణ్యస్నానాలు ఆచరించి గుడి చుట్టూ ప్రదక్షిణలు చేశారు. భక్తులు క్యూలో నిలబడి పోచమ్మను దర్శించుకున్నారు. మహిళలు నైవేద్యాలు వండి అమ్మవారికి బోనాలు సమర్పించారు. భక్తులు అమ్మవారికి ఒడిబియ్యం, తులాభారం, కుశీ పండుగ మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రాంగణం, హరితహారంలో నాటిన మొక్కలు, దుకాణాలు భక్తులతో కిటకిటలాడాయి. నిర్మల్, ఆదిలాబాద్, నిజమాబాద్, కరీంనగర్, జిగిత్యాల, హైదరాబాద్ జిల్లాల నుంచే కాకుండా మహారాష్ట్రలోని ముంబై, నాందేడ్, ఇస్లాపూర్, శివిని ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి మొక్కులను చెల్లించుకున్నారు. దేవాదాయ శాఖ ఈవో రమేశ్ ఆధ్వర్యంలో భక్తులు అసౌకర్యాలు కలుగకుండా ఏర్పాట్లు చేశారు. నిర్మల్, భైంసా ఆర్‌టీసీ డిపోల నుంచి ఆలయానికి భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక బస్సులను నడిపారు. జాతరను పురస్కరించుకుని నిర్మల్ డీఎస్పీ గంగారెడ్డి, రూరల్ సీఐ రామకృష్ణ, ఎస్ఐ శ్రీకాంత్ ఆధ్వర్యంలో సారంగాపూర్ నుంచి అడెల్లి దేవస్థానం వరకు బందోబస్తు నిర్వహించారు. అమ్మవారి నగల వెంట కూడా పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. శనివారం దిలావర్‌పూర్ మండలంలోని సాంగ్వీ గోదావరి తీరానికి తరలించిన అమ్మవారి నగలను గంగాజాలంతో శుద్ధి చేశారు. ఆదివారం భక్తిశ్రద్ధలతో ప్యారమూర్, వంజర్, యాకర్‌పల్లి, సారంగాపూర్, అడెల్లి మీదుగా వచ్చి ఆలయానికి చేరుకుంది. గ్రామాల్లో అమ్మవారి నగలకు డప్పుమేళాలతో, మహిళలు మంగళహారతులతో భక్తజనం మధ్య స్వాగతం పలికారు. అలాగే మత్స్యకారులు ఆయా గ్రామాల్లో వల గొడుగుతో స్వాగతం పలికారు. అమ్మవారి నగలను ఆలయంలో చేర్చి అమ్మవారిని అందంగా అలకరించి ప్రత్యేక పూజలు చేయడంతో గంగానీళ్ల జాతర ముగిసింది.

ఆలయంలో పూజలందుకుంటున్న అమ్మవారు

అమ్మవారి దర్శనం కోసం ఒంటికాలిమీద ఆలయానికి వస్తున్న భక్తుడు

ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే చర్యలు

ఆదిలాబాద్, అక్టోబర్ 6(నమస్తే తెలంగాణ): పెన్‌గంగా నదీ పరీవాహక ప్రాంతాల్లో ఇసుక అక్రమ రవాణాకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆదిలాబాద్ డీఎస్పీ జీవన్‌రెడ్డి తెలిపారు. బేల మండలంలోని కాంగార్‌పూర్ పెన్‌గంగా నది నుంచి ఇసుక రవాణా కాకుండా చర్యలు తీసుకున్నామన్నారు. రెవెన్యూ, మైనింగ్ అధికారులతో కలిసి దాడులు నిర్వహిస్తామని తెలిపారు. అక్రమ దందాను అడ్డుకునేందుకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామన్నారు. మహారాష్ట్రకు ఇసుక అక్రమ రవాణా జరగకుండా పకడ్బందీ చర్యలు తీసుకున్నామని, బేల మండలం శంకర్ గూడ చెక్‌పోస్టు వద్ద పోలీసులు తనిఖీలు నిర్వహిస్తున్నట్లు డీఎస్పీ పేర్కొన్నారు. ఇటీవల భీంపూర్ మండలంలోని గొల్లఘడ్ తాంసి నుంచి ఇసుకను తరలిస్తున్న టిప్పర్‌ను పట్టుకుని రూ.లక్ష జరిమానా విధించినట్లు తెలిపారు. బేల మండలంలోని కాంగార్‌పూర్ పెన్‌గంగా నుంచి అధికారులు సీజ్ చేసిన వాహనాలను తిరిగి రప్పించినట్లు ఆయన వివరించారు. ఇసుక వ్యాపారం చేస్తున్న వారిపై దొంగతనం కేసులు నమోదు చేస్తామని.. టిప్పర్లు, పడవలు, జేపీబీ వంటి ఇతర వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఇసుక అక్రమ రవాణాకు సంబంధించి ఎవరున్నా వెనకాడే ప్రసక్తి లేదని తెలిపారు. దళారులు ఈ దందాను మానుకోవాలని హెచ్చరించారు.

డీఎస్పీ జీవన్‌రెడ్డి

టార్చ్ ర్యాలీకి స్వాగతం

ఎదులాపురం, అక్టోబర్ 6 : సీఎం కప్-2024 పోటీల నేపథ్యంలో తెలంగాణలో నిర్వహిస్తున్న క్రీడాజ్యోతి పరుగు ఆదివారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రానికి చేరుకుంది. మావల బైపాస్ రోడ్డు వద్ద ఆదిలాబాద్ ఎంపీ నగేశ్ వారికి స్వాగతం పలికారు. క్రీడాజ్యోతి మావల బైపాస్ రోడ్డు నుంచి రాంనగర్, కుమ్రం భీం చౌక్, బాబూ జగ్జీవన్‌రావ్ చౌక్ మీదుగా ఇందిరా ప్రియదర్శిని స్టేడియం వరకు దాదాపు పది కిలో మీటర్ల వరకు పరుగెత్తారు. జిల్లా ట్రైబల్ స్పోర్ట్స్ ఆఫీసర్ పార్థసారథి, సూపరింటెండెంట్ రజియోద్దీన్, సిబ్బంది ఎక్బాల్, సురేశ్, వినోద్ స్పోర్ట్స్ స్కూల్ కోచ్‌లు రాజు, సాయికుమార్ పాల్గొన్నారు.

నిర్మల్ అర్బన్, అక్టోబర్ 6 : ఆదివారం సీఎం కప్ ర్యాలీ నిర్మల్ జిల్లా కేంద్రానికి చేరుకుంది. ఈ సందర్భంగా మంచిర్యాల చౌరస్తాలో స్థానిక ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్‌లతో కలిసి కలెక్టర్ అభిలాష అభినవ్ ర్యాలీకి స్వాగతం పలికారు. అనంతరం క్రీడాజ్యోతిని వెలిగించి కలెక్టర్ ర్యాలీని ప్రారంభించారు. ఈ ర్యాలీ మంచిర్యాల చౌరస్తా మీదుగా ఎన్టీఆర్ స్టేడియానికి చేరుకుంది. అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, చైర్మన్ ఈశ్వర్ పాల్గొన్నారు.

టార్చ్ ర్యాలీకి స్వాగతం పలుకుతున్న ఎంపీ నగేశ్

ఇంద్రవెల్లిలో కూల్చివేసిన నిర్మాణంలో ఉన్న భవనం

బడుగులపై బుల్డోజర్

ప్రభుత్వ తీరును వ్యతిరేకంగా నిరసన తెలుపుతున్న స్థానికులు

అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తున్న అధికారులు

- కాంగ్రెస్ సర్కారు ఆదేశాల మేరకు కూల్చివేతలు
- మొన్న ఖానాపూర్‌లో మార్కింగ్.. నిన్న ఇంద్రవెల్లిలో నేలమట్టం..
- ఖానాపూర్‌లో స్థానికులు తిరగబడడంతో వెనక్కి..
- ఇంద్రవెల్లిలో రెండిండ్లు కూల్చివేతతో స్థానికుల దీక్షలు
- అంబేద్కర్ చౌక్‌లో రిలే నిరాహార దీక్షలు
- ఇండ్లు కూల్చివేతకు నిరసనంగా మార్కెట్ బంద్
- కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై ఆగ్రహజ్వాలలు

ఆదిలాబాద్(నమస్తే తెలంగాణ)/ఇంద్రవెల్లి, అక్టోబర్ 6 : ఆదిలాబాద్ జిల్లావాసుల్లో ఇండ్ల కూల్చివేత భయం పట్టుకున్నది. ఇటీవల జిల్లా కేంద్రంలోని ఖానాపూర్ చెరువు పరిసర ప్రాంతాల్లో అధికారులు మార్కింగ్ చేయడంతో స్థానికులు ఆందోళనకు గురయ్యారు. హైదరాబాద్‌లో హైడ్రా తరహాలో తమ ఇండ్లను కూల్చివేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుందంటూ ఆందోళన చేపట్టారు. తాము ఇండ్లను కూల్చమంటూ, చెరువును రక్షించడానికి ఇకపై నిర్మాణాలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నామని అధికారులు పేర్కొన్నా బెంబేలెత్తిపోతున్నారు. ఇందులో భాగంగానే ఇండ్ల మార్కింగ్ చేస్తున్నామని అధికారులు తెలిపినా భయం వీడడం లేదు. పోలీసులతో కలిసి మార్కింగ్‌కు ఖానాపూర్ ఏరియాకు వెళ్లిన అధికారులను స్థానికులు అడ్డుకోగా.. మార్కింగ్ చేయకుండా వెనుదిరిగారు. నాలుగు రోజుల నుంచి ఖానాపూర్ చెరువు పరిసరాల్లో అధికారులు వెళ్లకపోవడంతో మార్కింగ్‌లు నిలిచిపోయాయి.

ఇంద్రవెల్లిలో రెండు భవనాలు కూల్చివేత

ఇంద్రవెల్లి మండల కేంద్రంలో పంచాయతీ అధికారులు నిర్మాణంలో ఉన్న రెండు భవనాలను కూల్చివేశారు. మార్కెట్ యార్డు సమీపంలోని ప్రభుత్వ భూమిలో నిర్మిస్తున్న భవనంతోపాటు అనుమతులు లేని మరో భవన పిల్లర్లను పడగొట్టారు. భవనాల కూల్చివేతను నిరసిస్తూ స్థానికులు మార్కెట్ బంద్ పాటించి ఆందోళన చేపట్టారు. గ్రామ పంచాయతీ కార్యాలయం ముందు భారీ సంఖ్యలో బైఠాయించారు. దీంతో ఉద్రిక్త పరిస్థితులు చోటుచేసుకున్నాయి. ఎన్నో సంవత్సరాలకు ఇక్కడ నివాసం ఉంటున్నామని, ఇండ్ల కూల్చివేతలు ఆపాలని డిమాండ్ చేశారు. ఉట్నూర్ సబ్ కలెక్టర్ యువరాజ్ వారికి నచ్చచెప్పడంతో వివాదం సద్దు మణిగింది.

ఇంద్రవెల్లి మండలకేంద్రంలో బంద్ పాటించిన దుకాణాలు

అంబేద్కర్ చౌక్‌లో రిలే నిరాహార దీక్షలు

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతంలో 1/70 చట్టం అమలు కంటే ముందు నుంచి నివాసం ఉంటున్న గిరిజనేతరులకు ప్రభుత్వం రక్షణ కల్పించి, సమస్యలను పరిష్కరించాలని గిరిజనేతరుల సంఘం, గిరిజనేతరుల ఐక్య వేదిక జిల్లా నాయకులు జాడే నాగోరావ్, మారుతి పటేల్ డోంగ్రే ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ఇంద్రవెల్లి మండలకేంద్రంలోని అంబేద్కర్ చౌక్‌లో గిరిజనేతరుల సంఘం, గిరిజనేతరుల ఐక్య వేదిక ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 1/70 చట్టాలను కాపాడుతూనే ఆదివాసీ గిరిజనుల చట్టాలు, హక్కులకు రక్షణ కల్పించి, గిరిజనేతరులను అన్ని విధాలా ఆదుకోవాలని విన్నవించారు. ప్రభుత్వ భూముల పేరిట అనుమతులు లేవని ఇండ్లను అధికారులు కూల్చడాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. ఏజెన్సీలోని గిరిజనేతరులను ప్రభుత్వం అన్ని విధాలు అదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గిరిజనేతర సంఘం నాయకులు ఎండీ మసూద్, సంజయ్ లహనే, మిర్జా జిలానీ బేగ్, కేశవ్ ముస్లే, బాబు ముండే, ఫడ్ ప్రకాశ్, దేవ్‌పూజె మారుతి, దిలీప్‌మోరే, ఆచార్యే దత్తా, సూరజ్, మారుతి మహారాజ్, పరత్‌వాగ్ దత్తా, సత్యానంద్, అశోక్, గన్యాన్‌సింగ్, నారాయణసింగ్, విశ్వనాథ్ ఫడ్, నిత్తుసింగ్ పాల్గొన్నారు.

అంబేద్కర్ చౌక్‌లో రిలే నిరాహార దీక్షలు చేపడుతున్న గిరిజనేతరులు

ఇంద్రవెల్లి మార్కెట్ బంద్

ఇంద్రవెల్లి మార్కెట్‌ను గిరిజనేతరులు, వ్యాపారస్తులు బంద్ పాటించారు. ఆదివారం మండలకేంద్రానికి చెందిన వ్యాపారస్తులు స్వచ్ఛందంగా తమ దుకాణాలను బంద్ చేశారు. అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఉట్నూర్ సీఐ మొగిలి, ఇంద్రవెల్లి ఎస్ఐ సునీల్ బందోబస్తుపై ఆరా తీశారు. పోలీస్ స్టేషన్‌లో గిరిజనేతరుల సంఘం పెద్దలతో ఉట్నూర్ సీఐ పలు అంశాలపై చర్చించారు.

బంజారా భవన నిర్మాణానికి భూమిపూజ

ఎదులాపురం, అక్టోబర్ 6 : ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కాలేజీ వెనుక రూ.2 కోట్లతో నిర్మించే బంజారా భవన్ నిర్మాణానికి ఆదివారం భూమిపూజ చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ముందుగా జంగదమ్మదేవి, సేవాలాల్, సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ చిత్రపటాలకు పూజలు చేశారు. ఈ కార్యక్రమాన్ని బోథ్, ఆదిలాబాద్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్, పాయల్ శంకర్, కర్ణాటక మాజీ మంత్రి బాబూరావు చౌహాన్, జాతీయ అధ్యక్షుడు అమర్‌సింగ్ తిలావత్, బంజారా సంఘం నాయకులతో కలిసి ఎంపీ నగేశ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం ఇటీవల మరణించిన మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్‌కు రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంపీ జి.నగేశ్ మాట్లాడుతూ.. ఎన్నో అడ్డంకులు పూర్తి చేసి బంజారా భవన నిర్మాణానికి భూమిపూజ చేశామని, భవనాన్ని నిర్మించే వరకు ఉన్న ఉత్సాహం దానిని ఉపయోగించడంలో కూడా చూపాలని సూచించారు. కేంద్రం నుంచి రావాల్సిన నిధులను తీసుకొచ్చే వరకు కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ.. సమాజం ఐక్యతతో ఉండి భవనాన్ని నిర్మించుకోవాలని, హైదరాబాద్ నడిబొడ్డున బంజారా హిల్స్‌లో రూ.100 కోట్ల స్థలంలో రూ. 25 కోట్లతో బంజారా భవన్ నిర్మించిన కేసీఆర్‌కి ఈ సభ ద్వారా బంజారా సోదరుల తరపున కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా ఆదిలాబాద్ పట్టణంలో బంజారా భవన్ నిర్మాణానికి స్థలం కేటాయించిన మాజీ మంత్రి జోగు రామన్నకి కృతజ్ఞతలు తెలిపారు. భవన నిర్మాణానికి ఎంపీ గోడం నగేష్ సహకరించాలని, ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ చొరవతో భవనం పూర్తి కావాలని పాయల్ శంకర్‌ని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీ చైర్మన్ జనార్దన్ రాథోడ్, సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాబులాల్, కౌన్సిలర్లు పవన్ నాయక్, అర్చన రాంకుమార్, ఉష్కం రఘుపతి, ట్రైబల్ వెల్ఫేర్ ఈఈ రాథోడ్ భీంరావ్, ఆర్‌అండ్‌బీ ఈఈ సురేశ్, జిల్లా అధ్యక్షుడు రెడ్యానాయక్, మాజీ అధ్యక్షుడు రామారావ్ రాథోడ్, హీరాలాల్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.



చిత్రపటాల వద్ద ప్రత్యేక పూజలు చేస్తున్న ఎంపీ, ఎమ్మెల్యేలు, మాజీ జడ్పీ చైర్మన్, కర్ణాటక మాజీ మంత్రి, జాతీయ అధ్యక్షుడు, నాయకులు

భార్యపై హత్యాయత్నం చేసిన భర్త రిమాండ్

ఎదులాపురం, అక్టోబర్ 6: విడిపోయి ఉంటున్న భార్యపై పట్టపగలు భర్త కత్తితో హత్యయత్నానికి శనివారం పాల్పడిన విషయం తెలిసిందే. మావల ఎస్ఐ విష్ణు వర్ధన్ వివరాల ప్రకారం.. జై జవాన్ నగర్‌కు చెందిన అభిలాష్ 2020లో మహాలక్ష్మి వాడకు చెందిన యువతిని ప్రేమ వివాహం చేసుకున్నాడు. వారి మధ్య అభిప్రాయ బేధాలు తలెత్తి ఈ ఏడాది ఫిబ్రవరిలో న్యాయవాది వద్ద విడాకుల పత్రం రాయించుకున్నారు. అనంతరం ఆమె ఒక సూపర్ మార్కెట్‌లో ఉద్యోగం చేస్తోంది. భర్త అభిలాష్‌ను చూసి ఆమె కేకలు వేయడంతో అక్కడి నుంచి పారిపోయాడు. కాగా భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పరారీలో ఉన్న భర్తను ఆదివారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

కుష్మాండ రూపంలో బాసర అమ్మవారు

కుష్మాండ రూపంలో బాసర అమ్మవారు

బాసర, అక్టోబరు 6 : నిర్మల్ జిల్లా బాసర సరస్వతీ ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. నాలుగో రోజైన ఆదివారం సరస్వతీ అమ్మవారు కుష్మాండ రూపంతో భక్తులకు దర్శనం ఇచ్చారు. అర్చకులు ఆలయంలో సుహాసిని పూజ, మంత్రపుష్పం, చతుర్వేద పారాయణం, లలిత సహస్రనామాలు, నివేదన హారతి పూజలను నిర్వహించారు. నాలుగో రోజు అమ్మవారికి అర్చకులు అల్లం వడలు నైవేద్యంగా సమర్పించారు.

తహసీల్దార్‌ను సస్పెండ్ చేయాలి

ఖానాపూర్ టౌన్, అక్టోబర్ 6 : అక్రమంగా మొరం, ఇసుక తరలిస్తున్న వ్యాపారులకు కొమ్ముకాస్తున్న తహసీల్దార్ శివరాజ్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కార్యదర్శి నంది రామయ్య డిమాండ్ చేశారు. ఆదివారం ఖానాపూర్‌లోని ఐబీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కుమ్రంభీం చౌరస్తాలో గల ప్రభుత్వ భూమిలో నుంచి కొద్ది రోజులుగా సాగుతున్న మొరం దందాను అధికారులు అడ్డుకోకపోవడంలో అంతర్యమేమిటని ప్రశ్నించారు. అక్రమంగా మొరం తవ్వకాలపై తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్తే తమ పట్ల దురుసుగా ప్రవర్తించడం జరిగిందన్నారు. అక్రమంగా మొరం తరలించడం వల్ల ఏర్పడిన పెద్దపెద్ద గుంతలను విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. మొరం దందాకు సహకరిస్తున్న తహసీల్దార్‌ను కలెక్టర్ జోక్యం చేసుకుని విచారణ జరిపి తహసీల్దార్‌ను సస్పెండ్ చేయాలన్నారు. నాయకులు అభిషేక్ తదితరులు పాల్గొన్నారు.